కథ

# ఓ అల్లుడి కథ

వీరాజీ

పాదాల మీదుగా చీరెకుచ్చెళ్లను సర్దుకుని కూచుంది సుహాసిని. తదేకంగా దిగంతంలోని స్నిగ్ధ నీలిమను చూస్తూ, ఇసుకలో వేలుంచి గీతలు గీస్తున్నది. జగన్నాథానికి భార్య ఉదాసీనత చూసి ఆందోళన చెలరేగింది. అతగాడు ఒడ్డున విరిగి వెనక్కి జారుకుంటున్న కెరటాలను పరికిస్తున్నట్లు, రెండు క్షణాలు తదేకంగా వాటికేసి చూసి "అదికాదు సుహాసినీ!" అన్నాడు.

సుహాసిని ఏమీ అనలేదు. 'ఏది కాదు?' అన్నట్లు కనీసం తనకేసి చూసి, కనుబొమ్మలు విరిచినా, తను చెప్పదల్చుకున్న నాలుగు మాటలూ చెప్పేవాడు జగన్నాథం. కానీ ఆ పిల్ల శిలాప్రతిమలా అలాగే కూర్చుని, తను గీసిన గీతలలోని గూడార్థం కోసమా అన్నట్లు తదేకంగా ఊరుకున్నది. ఆమె రూపం సమ్మోహనంగానే ఉంది గానీ ఆ క్షణంలో జగన్నాథం అహంకారం దెబ్బ తిన్నది.

అసలు మధ్యాహ్నం అతగాడు ఆమెను పిలిచి "చూడు సుహాసినీ, మనం సాయంకాలం బీచ్‌కి వెడదాం" అన్నప్పుడే "నీతో ఒక విషయం మాట్లాడాలి" అని తెలియబరిచినప్పుడే ఆ పిల్ల నిరుత్సాహపడడం అతగాడు గ్రహించాడు. అయినా తప్పదు గనుక-

"మనిద్దరమే. మరెవర్నీ తీసుకురాకూ" అని కూడా చెప్పాడు.

క్షణాలు నిశ్శబ్దంలో కరిగి చీకటి తెరలు వాలుతున్నాయి. తటపటాయించిన జగన్నాథం చెప్పాడు.

"చూడు సుహాసినీ! నాన్నగారి సంగతి నీకు తెలిసిందే కదా! ఆయనకి పిసినారి తనం చుప్పనాతి తనం ఉన్నాయని చిన్నవాళ్లం మనం అనకూడదు"

"ఇటువంటి విషయం మాత్రం ఆయన మొదట్నించీ సంప్రదాయం, పరువుప్రతిష్టలూ వీటిమీదనే ధ్యాస ఉంచుతారు"

తన కొడుకు అత్తవారి ఇంటికి పోయి ఉత్త చేతులతో తిరిగి వస్తే అందులోను పెద్ద పండుగకి వెళ్లినపుడు నలుగురూ ఏమనుకుంటారు? అనేదే ఆయన బెంగ. ఆ నాలుగు మాటలు అనేసిన తర్వాత తల మీద నుంచి ఎంతో బరువు దించేసినట్లయింది జగన్నాథానికి.

అతగాడు అత్తగారింటికి భార్యతో సహా పండుగకి వచ్చాడు. మామగారు చేసేది గుమస్తాగిరీ అవడం చేత ఇప్పుడు ఇదివరకు అనుకున్నట్లు బ్రాస్‌లెట్ కొనిపెట్టే ఛాయలేమీ అగుపించడం లేదు. జగన్నాథం ఉద్యోగం పెద్దదే చేస్తున్నాడు. అతగాడి తండ్రి హోదా ఉన్నవాడే కూడాను. కానీ ఒకసారి సుహాసిని తల్లి స్పష్టంగా అన్న మాటలు జగన్నాథం తండ్రికి చక్కగా జ్ఞాపకం ఉన్నాయి.

ఆమె సందర్భమొచ్చి అన్నది. "మా అల్లుడికి వారు (అంటే ఆమె భర్త) బ్రాసెలెట్‌లలో మాంచి ఖరీదైనదాన్ని కొందామనుకుంటున్నారు బహుశా రేపు పండగకేనేమో"

ఇప్పుడు జగన్నాథం ఆ ఆశతోనే వచ్చాడు. అతగాడి తండ్రి ఆ పట్టుదల మీదే కొడుకునీ, కోడలునీ ఇల్లు కదలనిచ్చాడు.

జగన్నాథం, సుహాసినీ ఏమీ మాట్లాడకపోవడంతో పరిస్థితులను ఇంకో రకంగా ఎదుర్కొందామనుకున్నాడు. భార్యకేసి రెండు క్షణాలు తదేకంగా చూసి "మీ అన్నయ్యా వాళ్ల అత్తగారు పెట్టిన టీవీ చాలా ఖరీదైంది అనుకుంటాను?" అని భోగట్టా చేశాడు.

"అవును కాబోలు... మొత్తానికి ఖరీదైనదేనుట" ఎక్కణ్నుంచో మాటాడుతున్నట్లు ఉన్నాయి ఆమె మాటలు.

"చూశావా?" తను కూర్చున్న భంగిమ మార్చుకుని, కంఠస్వరం కాస్త హెచ్చించి అన్నాడు జగన్నాథం.

"రిటైరైపోయి దమ్మిడీ సంపాదన లేకుండా కూచున్నా, వాళ్ల మామగారికి మీ వదినె కాపురమంటే ఎంత శ్రద్ధోను"

సుహాసిని నొచ్చుకున్నది. "అంటే.. మీ ఉద్దేశం మా నాన్నగారికి మాత్రం తన కూతురి సంసారం ధ్యాస లేదంటారు. ఆయన కన్న కూతురి కాపురంలో నీళ్లు పోస్తారంటారు?" ఎర్రగా చూసి ఎర్రనైన మొహం అంతలో దించుకుంది.

జగన్నాథం కూడా ఆమెను సూటిగా చూసే ప్రయత్నం చేసి "నేను ఎందుకంటాను? కానీ ఎవరేనా అంటారనుకో. నేను అడ్డుపడగలనా?"

అతగాడి మాటల్లో వచ్చిన 'ఎవరేనా?' అన్న మాటలకర్థం- తన మామగారేనని సుహాసినికి తెలుసు. కానీ ఏం చేయగలదు? వస్తున్నప్పుడు పుట్టింటి నలుగుర్నీ చూద్దామన్న ఉబలాటమే ఎక్కువ ఉన్నది కానీ... చిక్కులు తలెత్తుతాయన్న జ్ఞానమే రాలేదు!

అసలు జగన్నాథం ఇంత పట్టుదల, మంకుతనం పడతాడనుకోలేదు తను. కానీ అది ఎందుకో కూడా ఇప్పుడా పిల్లకి తెలుసు.

సుహాసిని అన్నయ్య రామం పండుగకి అత్తవారింటికి వెళ్లలేదు. అందుకు కారణం వాళ్లు రెండేళ్లుగా జరిపింతాలు పెడుతున్నా టీవీ కొని ఇవ్వకపోవడమే. సుహాసిని తన భర్తతో బండి దిగేసరికి మొదట వదినె ఎదురొచ్చింది.

"నువ్వు దర్శనమిస్తావనుకోలేదు" అన్నది నవ్వుతూ సుహాసిని.

"ఏం చెయ్యను? మీ అన్నయ్యగారు హుకుం వేశారు" అన్నది నవ్వుతూ వదిన.

ఎందుకని అడగలేదు సుహాసిని, కానీ తర్వాత తెలుసుకుంది. అన్నయ్యకి మామగారు పెడతానన్న టీవీయే అందుకు కారణం అని.

జగన్నాథం కూడా తనను తీసుకుని రాకుండా అలిగితే బాగుండునే అనుకుంది సుహాసిని. తన తండ్రి ఆర్థిక పరిస్థితులు చాలా దిగజారిపోయి ఉన్నాయి. అది చూస్తూ తాను బ్రాస్‌లెట్ గురించి నిలదియ్యలేదు కదా? అదే మాట అందామనుకుంది భర్తతో. కానీ ఆ ఉదయం మరో సంఘటన జరిగింది. అటు తర్వాత ఆ పిల్లకి భర్త ఎదుటపడ్డానికే తల తీసినట్లుంది!

రామం మామగారు ఆవేళ ఉదయమే టీవీ సరికొత్తది పంపించేశాడు. తన కళ్ల ముందరే అన్నయ్య స్నేహితుడు వచ్చి "ఇదిగోరా రామం! మీ మామగారు ఈ టీవీ నీకు అప్పజెప్పమన్నారు. పాపం నువ్వు మీ ఆవిడా రాలేదని ఆయన ఎంతో నొచ్చుకున్నారు. ఇక మీ అత్తగారైతే మీ అమ్మగారితో మరీ మరీ చెప్పమన్నారు ఎలాగైనా అల్లుణ్నీ, కూతుర్నీ పండగ నాటికి సాయంకాలానికైనా పంపమని" అంటూ టీవీ ఇచ్చాడు.

అన్నయ్య గర్వంగా వదినకేసి చూశాడు. వదిన తనకేసి అమ్మకేసి చూసింది. అన్నయ్య అన్నాడు. "లాభం లేదే.. అల్లుడైన వాడికి మొహమాటం ఉండకూడదు. అందుకనే భామామణీ... మీ నాన్నగారికి పదివేలు వదలగొట్టేశాం"

ఆ నవ్వు వదినకెంత ఆనందాన్ని- గర్వాన్ని ఇచ్చిందో తనకంత గుండెల్లో ముల్లులాగ గుచ్చుకుంది. అదే సమయంలో జగన్నాథం స్నానం చేసి అక్కడకి వచ్చాడు. అతగాడి చెవుల్లో తన మామగారు కొడుకు ప్రయోజకత్వాన్ని మెచ్చుకుని నవ్విన నవ్వు పడింది. సుహాసిని ఆ సంఘటన తప్పించలేకపోయింది. అయినా భర్తకి తన ఇంటి దుస్థితి చెప్పాలనే ప్రయత్నంలోనే "నిజంగా.. మా వాళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారండీ" అన్నది ఎట్టకేలకు నోరువిప్పి.

"నిజమే పరిస్థితులు బాగున్నాయని నేనూ అనను. కానీ మీ అన్నయ్య మాత్రం తన మామగారి పట్ల ఏమాత్రం కరుణ, సానుభూతి ప్రకటించాడు?"

"నా పరువు కాపాడాల్సిన బాధ్యత అతగాడి మీద లేదా!" భర్త మాటలకి సుహాసిని కన్నీళ్లు కార్చేదే గానీ

వాటి ప్రయోజనం ఏం ఉండదని ఆ పిల్ల ఎరుగును" మెల్లిగా అన్నది.

"లేదండీ! పాపం అన్నయ్య నా చేతులు పట్టుకుని మరీ బ్రతిమాలుకున్నారు. చెల్లీ! నన్ను క్షమించమ్మా! లోను ఇప్పుడు ఇవ్వనన్నారు వచ్చే నెల ఇస్తారు. అప్పుడు ఏదో విధంగా కొంటానని"

ఆ మాటలతో జగన్నాథం వెటకారంగా నవ్వాడు.

"అందుకనే కదూ? టీవీ ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. మరి తను తన భార్యను పుట్టింటికి పంప కుండా ఎందుకు ఉంచేశాడు?"

సుహాసిని జవాబు చెప్పలేదు.

జగన్నాథమే పూర్తి చేశాడు. "ఎందుకనో తెలుసా? మీ నాన్నగారు వద్దన్నారు. మరి మా నాన్నగారికేనన్న మాట. ఆమాత్రం హక్కులేదు? అదీగాక మా నాన్నగారి నైజం నువ్వెరుగుదువుగా!"


తలూపింది సుహాసిని. "మరోసారి అడుగుతా నండీ" అన్నది కన్నీళ్లు ఆపుకుని.


"సరే ఏదో నువ్వు చెయ్యి గానీ నేను రేపు ఉదయం వెడుతున్నాను. మా నాన్నగారు చంపేస్తాడు" అంటూ లేవబోయాడు జగన్నాథం.

సుహాసినికి ఏమనాలో తోచలేదు. ఏమి చెయ్యాలో తెలియలేదు. "సరే! పండుగపూట ఉదయమే వెళ్లిపోతా రన్నమాట? అంతేనన్నమాట.. నేనా సముద్రంలోకి వెడ తాను"

జగన్నాథం ఆమెను పట్టుకున్నాడు.

"అది కూడా ఎందుకు? అప్ర దిష్ట. పద"





అన్నాడు. ఆమెను పది గంటల రాత్రి చీకట్లో రోడ్డువైపు నడిపిస్తూ.

"నీకు తెలీదా? నీమీద నాకెంత ఇది ఉందో సుహా!" జగన్నాథం దూరానా దీపస్తంభాల నుంచి బల హీనంగా వచ్చి తమమీద వాలుతున్న నీరసమైన వెలు గులో బరువుగా భార్యని నడిపిస్తూ అన్నాడు. "కానీ.. నాన్నగారు, అమ్మా నిన్ను ఎంత నీచంగా చూస్తారు? మన ఇద్దరం కలిసి వెడితే అందుకనైనా, నేను ముందుగా పోవాలి"

"ఊహూ.. అదొక్కటే తక్కువ. దేనికైనా పెట్టిపుట్టా లమ్మా వదినా నీకుమల్లే!" అన్నది వదిన అంత తెలియ నిదేం కాదు. మరి మాటాడలేదు.

జగన్నాథం ఆ రోజు రాత్రి వంట్లో ఏమీ బాగులేద న్నాడు. పేరు పేరున వరుసగా అందరూ వచ్చి బ్రతిమా లేరు!

"బాగుంది. నాకేం మొహమాటం. అలాంటివాణ్ణ యితే ఇంటి దగ్గరే ఉండిపోనా మా రామంబావలాగ. నా వంట్లో బాగులేదు. నాకు రెస్టు కావాలి" మాటలు, సందర్భం ఇవే మారేయి తప్ప... అర్థం అదే వచ్చేటట్లు అందర్నీ తిరగ్గొట్టాడు.

సుహాసిని ఏమీ అనలేదు. ఏమన్నా అది నిప్పు మీద నెయ్యే అవుతుందని ఆ పిల్లకి తెలుసు. మర్నాడు ఉదయం పండుగపూటా భర్త తన పరువు, తన కన్న వారి పరువు దక్కనివ్వడన్న బెంగే ఎక్కువయింది. తండ్రితో ఏమంటుందీ?

ఇల్లు లేదు. ఒకసారి తనఖా పెట్టేశాడు గనుక మరి అప్పురాదు. ఉద్యోగంలోనా? లోను అయిపోయింది.

భార్య ఏడుస్తున్నదని తెలుసు జగన్నాథానికి- కానీ ఏం చేయగలడు? కనీసం తానేం చేయలేనని అత గాడి ఉద్దేశం.

దీపాల వేళదాటి రెండు గంటలసేపయినా ఇంటికి అల్లుడు కూతురు రాలేదేమో? అని ఇంటిల్లిపాదీ గాభరాపడు తున్నప్పుడు ఇల్లు చేరుకున్నారు సుహాసినీ, జగన్నాథం దంపతులు.

గడప లోపలకి అడుగు వెయ్యగానే ధుమధుమలా డుతున్న జగన్నాథం గదిలోకి పోగా ఇష్ట జనపరివారం మధ్య సుహాసిని మాత్రం మిగిలింది.

వదిన వచ్చి చెయ్యి వేసింది భుజం మీద. "సిని మాకి గానీ వెళ్లేరేమో అనుకున్నా"నంది. ఆమె చెయ్యి పాము పడగలా అనిపించింది సుహాసినికి.

ఇంకా ఇద్దరు ఆడపిల్లలు ఎదుగుతున్నారు. తండ్రినేమని అడగాలి?

భర్త మంచం దగ్గరే కూచుని పట్టెమీద తలపెట్టుకుంది. వ్యధాభారంతో నిద్రలోకి జారిపోయింది.

జగన్నాథం అలకపాన్పు స్వీకరించాడేగానీ ఆరోగ్యం చక్కగానే ఉంది గదా? నిద్ర ఎలా పడుతుంది మరి. ఏవో ఆలోచనలు... తండ్రి తనను భార్యను ఎంత చిన్నతనం చేస్తాడోనని భయం. ఇత్యాది ఆందోళనతో అటు ఇటూ భార్య కంటపడనంత జాగ్రత్తగానే పక్క మీద దొర్లాడు.

'అయ్యో! నా సంస్కారం ఇంతలా దిగజారిందే. పాపం ఇంటిల్లిపాదీ బ్రతిమాలేరు కదా? అయ్యో అందరూ నొచ్చుకుని ఉంటారు' అని కూడా ఒకటి రెండుసార్లు అనుకున్నాడు.

అవతలికి పోవాల్సిన అవసరం వచ్చింది. మెల్లిగా లేచాడు. భార్య పట్టె మీద తల పెట్టి పడుకుంది. ఇంత పిసరు చడి లేకుండా లేచాడు. 'మళ్లీ ఇది లేచిందో ఇంటిల్లిపాదీ లేస్తారు. ఏ డాక్టరు దగ్గరికో పరిగెడతారు. అంతా ఫార్సు' అనుకుని సద్దుచేయకుండా తడుముకుంటూ గుమ్మం దాటాడు. పిల్లిలాగా అడుగులు వేసి వరండాలోకి వచ్చాడు.

పక్కగదిలో దీపం వెలుగుతున్నది. ఔను మరి రామం, భార్య, పండుగంతా వాళ్లదే. రామం ఎంత గర్వంగా ఉంటాడు. అతని భార్య ఎంత గర్వంగా రేపు పుట్టినింటికి వెడుతుంది!

తాపీగా నాలుగడుగులు ముందుకు వేశాడు. అనుకోకుండా అనవసరమైన కుతూహలం కలిగింది. గది లోపల్నించి మాటలు వినిపిస్తున్నాయి. గది బయట మాత్రం చీకట్లు అలుముకున్నాయి. కిటికీలో నుంచి పడే వెలుతురు తప్ప అంతా చీకటి, నిశ్శబ్దం!

"అదేమిటండీ! మా నాన్నకి మాత్రం రావాలని లేదూ?" అది భార్య గొంతు.

"ఔను" అన్నది రామం గొంతు గంభీరంగా.

"మరి.. టీవీ ఎందుకు పంపించాడని?" ఆమె రెట్టించింది. రామం నవ్వు విచిత్రంగా ఉంది.

"అయితే నువ్వు నిజంగా మీ నాన్న పంపించిన టీవీ అనే అనుకుంటున్నావు?" అతగాడి గొంతులో వింత ధ్వని ఉంది.

"మరి మీ నాన్నగారు అదేగనక లేకపోతే నన్ను గడపదాటనివ్వను. వాళ్లను గడప తొక్కనివ్వను అన్నారుగా"

"ఓసి! పిచ్చిదానా రెండువేపులా నలిగిపోయే వాణ్ని నేనున్నానుగా. నా కర్మ, లేదా అది నా ప్రయోజకత్వం అనుకో" అన్నాడు రామం.

బహుశా రామం భార్యను దగ్గరిగా అదుముకున్నాడేమో "అబ్బ ఉండండి" అన్న తర్వాత మళ్లీ ఆమె గొంతే వినిపించింది.

"అంటే?"

"అంటే" రామం చెప్పేశాడు. "అది నేను మా చెల్లెలు కోరినట్లు వాళ్లకి బహుమానం కొందామని పుచ్చుకున్న లోనుతో కొన్న టీవీ" రామం కంఠం గద్గదికమైంది. "ఏం చేయను. నీ దుఃఖం మీ వాళ్ల బలహీనత, మా వాళ్ల దెప్పిపొడుపులు నన్ను ఇలా చెయ్యమన్నాయి."

"అయ్యయ్యో, నిజమా" అనేటంతలో భార్యను రామం నోరు మూసిన వైనం కూడా జగన్నాథం కర్ణేంద్రియాలను సోకింది!

జగన్నాథానికి చిరుచెమట పోసింది. వాళ్ల మాటలు వినడం అనేదాని మంచి చెడ్డల గురించి అతగాడు ఆలోచించలేదు. అతని ఎదనెవరో పొడిచి పొడిచి ఏవో ప్రశ్నలడిగినట్లయింది.

"మీరెంత మంచివారండీ" అంటూ రామం భార్య రామాన్ని మెచ్చుకుంది. అతగాడికది స్వర్గం కాదా? ప్రపంచ విజేతలా ఫీలై ఉంటాడు రామం.

'మరి..మరి' కోపంతో జగన్నాథం రెండు పిడికిళ్లు బిగించాడు కానీ రెండు క్షణాల్లో అది కరిగిపోయింది.

అపును రామం స్వార్థపరుడే కావచ్చును? స్వార్థానికర్థాలు, భార్యను ఆనందపర్చటం. తల్లి దండ్రులను ఆనందపర్చడం. అత్తమామలను సంతోషపెట్టడం. ఇవే అయితే రామం స్వార్థపరుడే!

జగన్నాథానికి సిగ్గేసింది. తనేనా? సుహాసినిని ప్రేమించడం లేదు? వెనుదిరిగి ఒక్క ఉరుకున గదిలోకి వెళ్లి భార్యను కౌగిలించుకొని తాను రహస్యం కనిపెట్టేశానని చెపుదామనుకున్నాడు. ఐతే అతనలా చేయలేదు. అడుగులో అడుగు వేస్తూనే గదిలో అడుగు పెట్టాడు. మంచం మీద భార్య దగ్గరిగా కూచుని ఆమె తల నిమిరాడు.

"అతి చిన్న జీతగాడు మీ అన్నయ్యకి మహా అయితే లోను ఇరవైవేలు ఇస్తారేమో. నాకు ఎంత ఇస్తారంటావు?" అని గొణుక్కున్నాడు.

ఉలిక్కిపడి లేచింది సుహాసిని. కళ్లు ఏడ్చి ఏడ్చి వాచిపోయాయి. "ఏవండీ!" అని గాభరాపడిపోయింది. జగన్నాథానికి నిజంగా సిగ్గేసింది. "చూడు సుహా!" అన్నాడు గట్టిగా ఆ పిల్లకు ఊపిరాడనివ్వకుండా తన దగ్గరకి తీసుకుని.

"నేను.. నేను.."

"మీ కోసం పాలు తెచ్చాను. అయ్యో.. మర్చిపోయానంటూ" భర్త చేతుల్లో నుంచి విడిపించుకుని గ్లాసు అందుకుంది సుహాసిని.

"నువ్వు భోజనం చేయలేదు కదా?" అన్నాడు. జగన్నాథం భార్య కళ్లలోకి ఆశగా ప్రేమగా... తృప్తిగా చూసి.

"మీరు చేశారా?" అడిగింది సుహాసిని పాల గ్లాసునందిస్తూ.

ఆ ఇద్దరూ పాలు పంచుకున్నారు.

"మంచికో చెడ్డకో మంత్రోపదేశం అయ్యింది. నాకు రహస్యం తెలిసింది" అన్నాడు జగన్నాథం.

"మీరు ఏమంటున్నారో నాకు మాత్రం భయంగా ఉంది సుమండీ !"

భార్యను సాధ్యమైనంత చేరువుగా చేర్చుకుని "ఎందుకూ? నేను ఊరు వెళ్లనుగా" అన్నాడు భర్త- ఆ పిల్లకి ఆశ్చర్యపోడానికేమి అవకాశం మిగులలేదు.

○

## మలైకా ఐటమ్‌గాళ్ కాదిక

ఇంతకాలం 'ఐటమ్ గాళ్'గా బాలీవుడ్‌లో రాణిస్తున్న మలైకా అరోరా ఇన్నాళ్లకి హీరోయిన్‌గా నటించబోతోందిట. నటుడు సునీల్ శెట్టి నిర్మించబోయే హిందీ సినిమాలో అర్జున్ రాంఫల్ సరసన నాయికగా నటించడానికి ఎన్నికైందిట మలైకా. 'ఛయ ఛయ్య ఛయ్యా' అంటూ షారుఖ్‌తో 'దిల్‌సే' సినిమాలో డాన్స్ చేసినప్పటి నుంచీ ఆమెకి ఐటమ్ సాంగ్స్ బాగా వచ్చాయి. ఇప్పటికి ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ హీరోయిన్ అవుతోంది.

